క్లుప్తంగా

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ అండర్ 14, అండర్ 17 మండల స్థాయి ఆటల పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నాడు నేడు పథకంలో పాఠశాలలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందని, క్రీడలు, విద్యకు ముఖ్యమంత్రి సమాన ప్రాధ్యాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, ఉప సర్పంచ్ మధు, మండల విద్యాశాఖాధికారులు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, వట్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, పీఎల్ నాయుడు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీలో కలర్స్ డే



విజేతలతో ఫాదర్లు కాత్, డొమ్నిక్

పెదవేగి: పెదవేగిలోని ఎస్ఎంసీ పాఠశాలలో కలర్స్ డే కోలాహలంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చుక్కా అవినాష్‌రాజ్ ఆధ్వర్యంలో నర్సరీ విద్యార్థులు వివిధ రంగుల దుస్తులతో వచ్చి, రంగుల పేర్లు వాటి స్పెల్లింగ్‌లను చెప్పడమే కాకుండా, వాటిపై రైమ్స్, వాటిని జతపరచడం చేశారు. విద్యార్థులను ఇంగ్లాండ్ దేశం నుంచి వచ్చిన సంస్థ ప్రతినిధి ఫాదర్ కాత్ అభినందించారు. సంస్థ చైర్మన్ ఫాదర్ డొమ్నిక్ ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించి, బహుమతులు అందజేశారు.

ఘనంగా మేరీమాత ఆలయ వార్షికోత్సవం

పెదవేగి : పెదవేగిలోని మేరీమాత ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ రాచూరి బాలస్వామి ఆధ్వర్యంలో సంఘ కాపరి బొబ్బూరి రవికుమార్ సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేడుకల్లో మాల మహాసేన జిల్లా కార్యదర్శి మద్దుల స్వామిదాసు, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

భీమడోలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురు మందుబాబులను పోలీసులు అదుపులోకి తీసుకుని బుధవారం భీమడోలు కోర్టులో హాజరుపర్చారు. వారికి భీమడోలు మేజిస్ట్రేట్ టీఎఎస్ ఎస్ఆర్‌కే ఆదిత్య ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

సుడిదోమతో అధిక నష్టం

గణపవరం: ప్రస్తుత వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వరిలో సుడిదోమ తెగులు వ్యాప్తి ఎక్కువగా కనిపిస్తుందని, దీనివల్ల దిగుబడిలో అధిక నష్టం వస్తుందని తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పనపేటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సుడిదోమపై అవగాహన కల్పించారు. సుడిదోమ వరిదుబ్బు మొదలులో ఆశించి రసం పీల్చివేయడం వల్ల వరిదుబ్బు ఎండిపోయి ఈనిక జరగదని, ఈనిన చేలు గింజ పాలు పోసుకోదని వివరించారు. దీని నివారణకు పైమెట్రోజెన్ మందు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం రైతులకు పరిసరాల విశ్లేషణపై అవగాహన కల్పించారు. మిత్ర, శత్రు పురుగులను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో యర్రంశెట్టి ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కత్తి, రాడ్లతో దాడి

దెందులూరు: పాత గొడవల నేపథ్యంలో దెందులూరులో బుధవారం రాత్రి కత్తి, రాడ్లతో చేసిన దాడిలో అలుగులగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. పాత గొడవల నేపథ్యంలో అలుగులగూడెం గ్రామానికి బూసి బన్ను, కర్రే అరుణ్, చొక్కాకుల మోషే ఈ ముగ్గురు కలిసి దెందులూరులో మంచినీరు తెచ్చుకునేందుకు వెళుతుండగా గ్రామానికి చెందిన వ్యక్తులు కత్తి, రాడ్లతో దాడి చేశారని తమకు గాయాలయ్యాయని బాధితులు విలేకరులకు తెలిపారు. గాయపడిన ముగ్గురిని హుటాహుటినా చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎస్సై వివరణ: దెందులూరులో పాత గొడవల నేపథ్యంలో దాడి జరిగిన సంగతి వాస్తవమేనని, ఆ దాడిలో అలుగులగూడెం గ్రామానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దెందులూరు బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని వివరించారు.

మహిళలకు వరం.. వైఎస్సార్ కాపు నేస్తం

- లబ్ధిదారుల్లో హర్షం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వెల్లడి

దెందులూరు: కాపులకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థితిని కల్పిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పాటు అనంతరం మాట తప్పకుండా మడం తిప్పకుండా నిలబెట్టుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ కాపునేస్తం పథకం ఏర్పాటు చేయడం కాపు, ఒంటరి, తెలగ, బలిజ మహిళలకు సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.15 వేలను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు అకౌంట్లకు జమ చేస్తోంది. ఇప్పటి వరకు మూడు విడతలు కాపునేస్తం పథకంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదును జమ చేశారు. ఈ ఏడాది నాల్గవ విడత నిధులు మంజూరు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కాపుల అభివృద్ధి, సంక్షేమం, స్వయం ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో గుర్తింపు ఇవ్వలేదు. అన్ని కులాలతో పాటు కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వడం నగదు చెల్లింపులు చేస్తున్న ఏకై క ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. వైఎస్సార్ కాపునేస్తం పథకం లబ్ధి ద్వారా మహిళలు స్వయం ఉపాధి, కుటుంబ అభివృద్ధికి కొంత మేర తోడ్పాటు అందిస్తోందని లబ్ధిదారులు గ్రామగ్రామాన హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దెందులూరు నియోజకవర్గ వివరాలు

మండలం	లబ్ధిదారులు	నగదు
దెందులూరు	541	రూ.81.15 లక్షలు
పెదపాడు	462	రూ.69.30 లక్షలు
పెదవేగి	766	రూ.114.90 లక్షలు
ఏలూరు రూరల్	98	రూ.29.70లక్షలు

కాపులకు మరింత ప్రాధాన్యం



కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతా అంశాల్లో ఒక్కటి. నవరత్నాల పథకాలతో పాటు పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. భవిష్యత్తులో కాపు కులస్తులకు మరింత ప్రయోజనం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేకూరుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అమలుకు కృషి చేస్తున్నాం.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

వైఎస్సార్‌సీపీ వెంటే కాపులు



కాపులంతా వైఎస్సార్ సీపీ, సీఎం వైఎస్ జగన్‌తోనే ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపులు, తెలగ, బలిజ కులాల అభివృద్ధి, సంక్షేమ, స్వయం ఉపాధికి కట్టుబడి ఉన్నారు. గత పాలకులను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేశారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యం.

– పోకల రాంబాబు, కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు

మహిళలకు మరింత చేయూత



కాపులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది. వైఎస్సార్ కాపునేస్తం పథకం అమలు ద్వారా కాపు మహిళలకు మరింత చేయూత లభించింది. ఒక్కొక్క విడత, ఒక్కొక్క మహిళకు దళారుల ప్రమేయం లేకుండా రూ.15 వేలు నగదు వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. మహిళలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగానే ఎల్లప్పుడూ ఉంటాం.

– అప్పన పద్మావతి, వైస్ ఎంపీపీ, పెదపాడు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



కాపుకులస్తుల మహిళలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. వారి భవిష్యత్తుకు భద్రత, స్వయం ఉపాధి కోసం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కాపునేస్తం ఏర్పాటు చేశారు. వారి లబ్ధి కోసం నగదును అందచేస్తున్నారు. ఇది ఎప్పటికీ మరువరాని విషయం. కాపు నేస్తం పథకం కాపులకు లబ్ధిచేకూరుస్తుంది.

– ఏనుగు అంజలి, ఎంపీటీసీ, గోపన్నపాలెం

ధ్యానంతో మానసిక ప్రశాంతత

భీమడోలు: ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాధా.జోసులా అన్నారు. భీమడోలులో బుధవారం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ నిర్వాహకులు జి.అప్పన్న ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వివిధ గ్రామాల నుంచి హాజరైన పిరమిడ్ సొసైటీ సభ్యులు శ్వాసపై పట్టు సాధించేందుకు ఆమె శిక్షణా తరగతులను నిర్వహించారు. ధ్యానానికి అవసరమైన యోగాసనాలను వివరించారు. జోసులా మాట్లాడుతూ నిజజీవితంలో మనిషి ఒత్తిళ్లకు గురై అనేక రోగాలతో పాటు మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ధ్యానం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పచ్చా వెంకటేశ్వరరావు, పంట్ల రాము, పెన్మెంటి అప్పారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

భీమడోలు: తాగునీటి సమస్య పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామంలో మంచినీటి ఫిల్టర్ బెడ్స్ పాడైన నేపథ్యంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చొరవతో మండల పరిషత్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేసారు. ఆ నిధులతో ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు చేశారు. ఈ నేపథ్యంలో వాటిని బుధవారం ఎంపీపీ కనమాల రామయ్య, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్‌లు నీటిని విడుదలచేశారు. ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, గ్రామకార్యదర్శి సూర్య పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



ఎ.గోకవరంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపీడీవో ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. ఎ.గోకవరం, గోపాలపురం గ్రామాలలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఎఎన్ఎంలకు పలు సూచనలు చేశారు. వాలంటీర్లు, సచివాలయ, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఏ ఇంట్లో ఎవరెవరు అనారోగ్యంతో బాధపడుతున్నది గుర్తిస్తున్నారు. ఆ తరువాత వైద్యనిపుణలను గ్రామానికి తీసుకువచ్చి గుర్తించిన పేషంట్లను ప్రత్యేక క్యాంపులో చూపించటం జరుగుతుంది. అందులో భాగంగా మొదటి ఫేజ్‌లో సర్వే కార్యక్రమం చేపట్టారు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టరు శేఖరరెడ్డి, డాక్టరు వర్మ, డాక్టర్ జోషిరాయ్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఎ.గోకవరంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిద్దే సత్యవతి వేంకటేశ్వరరావు, గోపాలపురంలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టరు శ్రావణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శ



కామిరెడ్డి వెంకటేశ్వరరావు సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: శ్రీరామవరంలో కామిరెడ్డి వెంకటేశ్వరరావు, దెందులూరులో కొండపావులూరి బలరామకృష్ణల ఆకస్మిక మరణాలు బాధాకరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి శ్రీరామవరంలో కామిరెడ్డి వెంకటేశ్వరరావు సంతాప సభ, దెందులూరులో కొండపావులూరి బలరామకృష్ణ సంతాప సభలో పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు కామిరెడ్డి ఆనంద్‌బాబు, మాజీ సర్పంచ్ కామిరెడ్డి జలజాక్షి, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పార్టీ నాయకులు కామిరెడ్డి బాలు, అక్కినేని శ్రీనివాసరావు, కామిరెడ్డి ప్రసాద్, మామిడి రాంబాబు, పోకల రాంబాబు, తొత్తడి వేదకుమారి, కొలుసు గణపతిరావు, కట్టా ఏసుబాబు, చల్లా మేరి రాజు, వన్నెకూటి సుందరం, రాజు, కొండపావులూరి శేషు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూమార్పిడి దరఖాస్తు ప్రదేశాల పరిశీలన

ఉంగుటూరు: భూమార్పిడి దరఖాస్తు ప్రదేశాలను ఏలూరు ఆర్డీవో ఎస్‌కే ఖాదర్ వల్లీ బుధవారం పరిశీలించారు. సుమారు 8 ప్రదేశాలను కైకరం, గోపినాధపట్నం, నల్లమాడు, చేబ్రోలు, ఉప్పాకపాడు గ్రామాలు తిరిగి పరిశీలించారు. ఇళ్ల స్థలాలు, ఇతర వ్యాపారాలు, పరిశ్రమలు నిర్మాణా లకు భూమార్పిడి చేసేవారు ఇలా దరఖాస్తు చేస్తే అధికార్లు అనుమతి పొందాల్సి ఉంటుంది.

వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

ఉంగుటూరు: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ముందుగా పోలీసులు హెచ్చరికలు చేయడంతో యువత చాలా జాగ్రత్తగానే ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం, బాదంపూడి, గొల్లగూడెం, రాచూరు, బొమ్మిడి గ్రామాలలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంలో వినాయకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. పందిర్లు వేశారు. ప్రతి రోజూ భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.

డ్రైఫ్రూట్స్ లడ్డూతో పంచముఖ గణనాథుడు

గణపవరం: గణపవరం దండుమారెమ్మ అమ్మవారి ఆలయం వద్ద మారెమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచముఖ వినాయకుడు భక్తులను ఆకర్షిస్తున్నాడు. ఎఎంసీ వైస్‌చైర్మన్ గాదిరాజు అబ్బాస్ వినాయక మండపం వద్ద డ్రైఫ్రూట్స్‌తో చేసిన ప్రత్యేక లడ్డూ భక్తులను అలరిస్తుంది.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



గోపన్నపాలెంలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



పెదవేగి ఊరేగింపులో పాల్గొన్న యువత

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గోపన్నపాలెంలో గణేశుడిని ట్రాక్టర్‌పై ఊరేగించి నిమజ్జనం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కొండేటి గంగాధరబాబు ఆధ్వర్యంలో గ్రామ యువత ఊరేగింపులో పాల్గొన్నారు.

గార్లమడుగులో..

పెదవేగి : మండలంలోని గార్లమడుగులో కాఫీ పొడి ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. తీన్మార్ వాయిద్యాల నడుమ గణనాథుడ్ని గార్లమడుగు, లక్ష్మీపురం, పెదవేగి గ్రామాల్లో ఊరేగించి, అనంతరం పెదవేగిలోని రత్నకోనేరులో నిమజ్జనం చేశారు. లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన గణేశుని లక్ష్మీపురం, పెదవేగి గ్రామాల్లో ఊరేగించి, రత్నకోనేరులో నిమజ్జనం చేశారు. లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్ యార్డులో నిర్వహించి వినాయక చవితి వేడుకలు ముగింపును పురస్కరించుకుని, వినాయక నిమజ్జనం అనంతరం భారీగా అన్నసమారాధన నిర్వహించారు.

నీలం వర్ణంలో గణనాథుడి దర్శనం

భీమడోలు: భీమడోలులోని శ్రీమన్మహా గణపతి ఆలయంలో 59వ నవరాత్ర పంచమి నవాంశ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన బుధవారం స్వామివారు సాంప్రదాయ నీలం వర్ణంతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని వివిధ వెండి అభరణాలతో విశేషంగా అలంకరించారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాల్లో గణనాధులు వివిధ వర్ణాలతో భక్తులకు దర్శనమివ్వడం సాంప్రదాయంగా వస్తుంది. ఆలయ పూజారి శేషుభట్టాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. మండలంలోని గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భీమడోలులో రాత్రి ఏలూరులోని నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో వినాయక చవితి నిమజ్జనాలు జరిగాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే కాపుల అభివృద్ధి

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి
- కాపునేస్తం లబ్ధిదారులు, నియోజకవర్గ కాపుల ఆత్మీయ సమావేశం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే కాపులకు ఏఎంసీ చైర్మన్ పదవితో పాటు రెండు మండలాలకు పార్టీ అధ్యక్ష పదవులు ఇచ్చిన ఘనత దక్కిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం గంగన్నగూడెం శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలులో దెందులూరు నియోజకవర్గ కాపునేస్తం, నియోజకవర్గ కాపుల ఆత్మీయ సమావేశం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో జరిగింది. తొలుత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అడపా శేషు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, దెందులూరు నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు పోకల రాంబాబు, జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన నియోజకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని కులాల్లో ఉన్న పేదలు, వారి ఇబ్బందులు వివరించడం, ఆనాడే మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వపరంగా అభివృద్ధి, సంక్షేమం ఖచ్చితంగా అమలు చేద్దామన్న హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గాలుగా ఉన్న ఐదు నియోజకవర్గాల్లో దెందులూరు నియోజకవర్గం ఒకటి కావడం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నియోజకవర్గ ప్రజలు అందరి సమిష్టి సహకారంతోనే జరిగిందని, లబ్దిదారుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. లండన్ నుంచి ఉద్యోగం వదులుకుని నియోజకవర్గానికి వచ్చిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గంలో కొఠారు రామచంద్రరావు, కొఠారు అబ్బయ్యచౌదరిలను మీ కుటుంబసభ్యులుగా కుల,మత,వర్గాలకు అతీతంగా ఆదరించి అక్కున చేర్చుకుని ఎమ్మెల్యేగా ఆశీర్వదించిన సంగతి తాను ఎన్నటికి మరువలేనన్నారు. కొఠారు కుటుంబంతో అనేక కాపు కుటుంబ పెద్దలు ఆది నుంచి ప్రయాణం చేస్తున్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 1967 మంది కాపు లబ్ధిదారులకు రూ. 2కోట్లు వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. 2836 పెన్షన్లు ఇస్తున్నామని, వివిధ రూపాల్లో 19,770 మంది కాపులకు నియోజకవర్గంలో లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఏమి అభివృద్ధి చేశారని విమర్శిస్తున్నారని పెదవేగి, ఏలూరు, చింతలపూడి, కొప్పాక, వట్లూరు, విజయరాయి, రాయన్నపాలెం, జానంపేట, వంగూరు, కవ్వగుంట, తాళ్ళగోకవరం, చక్రాయిగూడెం, జంగారెడ్డిగూడెం రోడ్డు పెదపాడు మండలంలో రోడ్లు, ఏలూరు మండలంలో రూ.50 కోట్లతో రోడ్లు, 50 సంవత్సరాలుగా సమస్యగా ఉన్న వంతెన నిర్మాణం వేయడం జరిగిందన్నారు. ప్రత్తికోళ్ళలంకలో గత పాలకులు 22 రౌడీషీట్లు, 300 కేసులు, నిరంతరం పికెటింగ్‌లు ఏర్పాటు చేశారని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఆ గ్రామంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. నియోజకవర్గంలో నాడు-నేడు మన బడి పథకంలో 204 పాఠశాలలు నిర్మాణం జరిగిందన్నారు. 3 జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. వట్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన జి.గాయత్రి ఈ రోజు అమెరికాలోని వైట్‌హౌస్‌లో ప్రసంగించిందంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న నాడు-నేడు మన బడి పథకం ద్వారా కాదా అని ప్రశ్నించారు. ప్రతి గ్రామానికి హెల్త్ క్లినిక్ ఏర్పాటు, విజయరాయి, పెదవేగిల్లో వైద్యశాలలు ఆధునీకరణ, దెందులూరులో రూ.2 కోట్లకుపైగా నిధులు వెచ్చించి సీహెచ్‌సీ ఏర్పాటుతో పాటు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 171 ప్రభుత్వ భవనాలు నిర్మించామని, 11 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కుల,మత, వర్గాలకు అతీతంగా నియోజకవర్గంలో 174 జగనన్న కాలనీలు ఏర్పాటు చేశామని, అర్హులైన పేదలకు ఈ రెండు నెలల్లోపే ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ చంద్రబాబు అడుగడుగునా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, కాపులను దగా చేసి హామీలకే పరిమితమయ్యారన్నారు. కాపులకు గుర్తింపు, గౌరవం ఇచ్చిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే ముడిపడి ఉందన్నారు. కాపుకార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాపులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లను నమ్మరన్నారు. నటుడుగా పవన్‌కళ్యాణ్‌ను అభిమానం ఉంటే ఉండవచ్చు తప్ప.. పార్టీపరంగా కాపులు వైఎస్సార్‌సీపీ వైపే ఉంటారన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి , మౌలిక వసతుల కల్పనకు సీఎం వైఎస్ జగన్ తొలిప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కాపులు అన్ని కులాలతో పాటు అన్ని వర్గాల ప్రజలతో పాటు మహిళలంతా ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే ఉండటమే కాకుండా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీకి బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, జగన్ సేవాదళ్ జిల్లా నాయకులు చిన్నమిల్లి వెంకట్రాయుడు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, దెందులూరు నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు పోకల రాంబాబు, జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, స్వచ్ఛంద కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మెట్లపల్లి సూరిబాబులు ప్రసంగించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ పీ. విజయ్‌బాబు, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్యతో పాటు నియోజకవర్గంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, దెందులూరు మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని, వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల అధ్యక్షులు, నాయకులు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాపు నేస్తం లబ్దిదారులు హాజరయ్యారు.